క్లుప్తంగా

కార్యకర్తల సమావేశం వాయిదా


నూకతోటి రాజేష్

నాగలాపురం: ఈ నెల 3న సత్యవేడులో నిర్వహించ తలపెట్టిన నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం వాయిదా వేసినట్లు ఆ నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ సోమవారం తెలిపారు. ఫెంగల్ తుపాను కారణంగా రెండు రోజులుగా భారీ వర్షం కురుస్తున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని, తిరిగి సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

తుపాను దెబ్బ.. ట్రాన్స్‌కోకు రూ.3లక్షల నష్టం


ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చుతున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: ఫెంగల్ తుపాను వలన దెబ్బతిన్న విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ చలపతి తెలిపారు. మండలంలో 12 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. మూడు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి, 20 పైగా స్తంభాలు ఒరిగిపోయినట్లు ఆయన చెప్పారు. సోమవారం కాంపాళెం, బుచ్చినాయుడుకండ్రిగ, కనమనంబేడు, పూసలపల్లె, కాటూరు, పల్లమాల, కల్లివెట్టు, గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేసినట్లు చెప్పారు. మండలంలోని సుమారు రూ. 3 లక్షల మేర నష్టం వాటిల్లిందని వెల్లడించారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు ఉంటే 9440811795 సెల్ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

మృత్యుంజయ స్వామికి ప్రత్యేక పూజలు


అభిషేకం చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయస్వామికి సోమవారం శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన పూజలు చేశారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ్ల, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేశారు. అనంతరం సుందరంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, వేదపండితులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నివారణపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అధ్యాపకులు, విద్యార్థులు అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నరసింహవర్మ మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజం దేశాభివృద్ధికి ఎంతైనా అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ గంగారామ్, అధ్యాపకులు చంద్రమౌళి, పరంధామయ్య, సుధీర్, నాగయ్య, మునెయ్య, రమేష్‌బాబు, బాబు, రాజేంద్ర, సునీత, సుభాషిణి, దేవి, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మండల పూజ

సత్యవేడు: సత్యవేడు పంచాయతీలోని దళవాయి అగ్రహారంలో అయ్యప్పస్వామి మండల పూజ ఘనంగా నిర్వహించారు. వంద మందికి పైగా కన్యస్వాములు, భక్తులు అయ్యప్ప పూజకు తరలి వచ్చారు. ఆది, సోమవారం వైభవంగా కన్యస్వామి పూజలు, భజనలు చేశారు. రాత్రి అల్పాహారం, ప్రసాదాల వితరణ చేశారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న డీఈ

బుచ్చినాయుడుకండ్రిగ: ఫెంగల్ తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్టు డీఈ రత్నాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యంను కలసి మండలంలోని చెరువుల పరిస్థితిని వివరించారు. ప్రస్తుతం చెరువులకు ఎలాంటి ప్రమాదం లేదని, కొన్ని చెరువుల తూములు, కలుజులు దెబ్బతిని ఉన్నాయని, వీటికి మరమ్మతుల నిమిత్తం జిల్లా అధికారులకు ప్రతిపాదనలను పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈ కల్లం బాషా పాల్గొన్నారు.

సంతవేలూరు ప్రాంతంలో వర్షాలకు ధ్వంసమైన నారుమడులు



పులిబొంద వద్ద కొట్టుకుపోయిన వరి పంట



ఉధృతంగా ప్రవహిస్తున్న సంతవేలూరు చెరువు



వర్షార్పణం

- తుపాను దెబ్బకు అతలాకుతలం
- పెద్దఎత్తున దెబ్బతిన్న నారుమడులు
- సంతవేలూరు చెరువుకు భారీగా చేరుకున్న వర్షపునీరు
- ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు కలుజు
- చెరువు నీరు భారీగా పంట పొలాల వైపు మళ్లింపు

సంతవేలూరు ప్రాంతంలో నీట మునిగిన వరి పంట



వరదయ్యపాళెం: ఫెంగల్ తుపాను వరదయ్యపాళెం మండలంలోని సంతవేలూరు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. నాటిన పంట పూర్తిగా నీట మునగగా, నాటేందుకు సిద్ధం చేసిన నారు మడులు సైతం వర్షపునీటిలో ధ్వంసమయ్యాయి. సంతవేలూరు చెరువుకు పెద్దఎత్తున వర్షపునీరు చేరడం, ఆ నీరంతా పంట పొలాల వైపు మరలడంతోనే తీవ్ర నష్టం వాటిల్లింది. మరోవైపు పంట పొలాలకు సమీపంలోని పులిబొంద, మార్ల మడుగు ఆనకట్టలకు సైతం పెద్దఎత్తున వరదనీరు చేరుకోవడం, గతంలో ఆనకట్టలకు చెందిన కాలువలకు గండ్లు పడడం మూలాన ప్రస్తుతం వర్షాలకు పెద్దఎత్తున పంట పొలాల వైపున వర్షపునీటి ఉధృతి పెరగడంతో పంటలు నీట మునిగి, పీకల్లోతు నష్టాల్లో సంతవేలూరు రైతులు మునిగిపోయారు.

ధ్వంసమైన నారుమడులు

దాదాపుగా 500 ఎకరాలకు పైగా సంతవేలూరు ప్రాంతంలో ప్రస్తుత రబీ సీజన్‌కు వరినాట్లు వేయాల్సి ఉంది. దీనికిగాను రైతులు 20 రోజుల నుంచి నారుమడులు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వరినాట్లు వేయాల్సిన పరిస్థితుల్లో ఒక్కసారిగా వచ్చిన తుపాను వర్షాల ధాటికి నారుమడులన్నీ ధ్వంసమయ్యాయి. దాదాపుగా 100 మంది రైతులు 500 బస్తాలకు పైగా వరి విత్తనాలతో చల్లిన నారుమడులు పూర్తిగా నీట మునిగిపోయాయి. మరలా వరినాట్లు వేయాలంటే రెండవసారి నారుమడులు సిద్ధం చేసుకోవాల్సిన దుస్థితి కలిగింది. మరలా నారుమడులు సిద్ధం చేసి నాట్లు వేయాలంటే ప్రస్తుత రబీ సీజన్‌లో అదును దాటిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చూడాలని కోరుతున్నారు.

నీటమునిగిన 200 ఎకరాల వరి

వ్యయప్రయాసలకోర్చి రెండు వారాల క్రితం సంతవేలూరు రైతులు వరినాట్లు వేశారు. అయితే 3 రోజులుగా ఫెంగల్ తుపాను మూలంగా కురుస్తున్న వర్షాలకు 200 ఎకరాలకు పైగా వరి పంట నీట మునిగింది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.


కొట్టుకుపోయిన పులిబొంద ఆనకట్ట వద్ద ధ్వంసమైన పొలాలు

కొట్టుకుపోయిన కాజ్‌వే

నారాయణవనం: ఫెంగల్ తుపాను మూలాన కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. తీరం పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. అరుణానది ఉధృతికి తుంబూరు కాజ్‌వే పూర్తిగా కొట్టుకుపోయింది. తిరువట్యం, నారాయణవనం, సముదాయం, పాలమంగళం నార్త్‌ల వద్ద లోలెవల్ కాజ్‌వేలపై అరుణానది ప్రవాహంతో రాకపోకలు స్తంభించాయి. దీంతో వందలాదిమంది విద్యార్థులు స్కూళ్లు, కళాశాలలకు హాజరు కాలేకపోయారు. తుపాను తీరం దాటే సమయంలో వీచిన పెనుగాలులకు అరణ్యంకండ్రిగ పంచాయతీ నక్కబోయిన ఏఏడబ్ల్యూకి చెందిన మునీశ్వరి అరటి పంట పూర్తిగా నేలకొరిగింది. అప్పులు చేసి సాగుచేస్తున్న అరటి పంట పూర్తి నష్టపోయామని మునీశ్వరి కన్నీటిపర్యంతమైంది.

రోగులకు సకాలంలో వైద్యం అందించాలి


మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు.. శ్రీరామ్‌నగర్‌కాలనీలోని యూపీహెచ్‌సీ సెంటర్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భవతులకు ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. యూపీహెచ్‌సీ పరిధిలోని చిన్న పిల్లలు వారికి అందించాల్సిన టీకాలను సకాలంలో అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. గజేంద్రనగర్, భాస్కరపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బాబు, శైలజ, స్రవంతి, రెడ్డి రూపేష్, డీపీవో ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వినూత్న నిరసన


గుంతల రోడ్డులో వరిపైరు నాటుతున్న కాంగ్రెస్ నేతలు

శ్రీకాళహస్తి: రోడ్ల దుస్థితిపై కాంగ్రెస్ పార్టీ వినూత్న నిరసన సోమవారం చేపట్టింది. తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి సమీపంలో చెంబేడు రోడ్డులో గుంతలమయంగా మారి నీటితో నిండి ఉన్న రోడ్డులో వరిపైరును నాటారు. నాయకులు తలపా దామోదర్‌రెడ్డి, బాలగురవం బాబు మాట్లాడారు. ఇటీవల కురుస్తున్న వర్షంతో రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే ప్రజలు, వాహనదారులు, పరిశ్రమలకు వెళ్లే వాహనాలు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాని, కరీముల్లా, మునిరాజా, వేలు, నవీన్, శశి, ధనకుమార్ పాల్గొన్నారు.

తెలుగు తమ్ముళ్ల ఆధిపత్య పోరు

-వాయిదా పడ్డ పంచాయతీ వేలం

రేణిగుంట: రేణిగుంట పంచాయతీలో తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతోంది. పంచాయతీ దుకాణ సముదాయాలు, వారపు సంత, మార్కెట్ వేలం పాట తెలుగు తమ్ముళ్ల మధ్య ఏర్పడిన పోరు వల్లే వాయిదా పడిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేణిగుంట పంచాయతీకి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న వేలంపాట సోమవారం నిర్వహించేందుకు అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేశారు. కానీ టీడీపీ స్థానిక కార్యకర్తలు దుకాణాలు వేలం పాట లేకుండానే సొంతం చేసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వేలంపాట పారదర్శకంగా జరగాలని కొందరు నాయకులు పంచాయతీ కార్యాలయానికి చేరుకొని వినతి పత్రాలు ఇచ్చారు. బజార్లోని పోస్ట్ ఆఫీస్ ఎదురుగా ఉన్న పంచాయతీ స్థలాన్ని నేల బాడిగ ద్వారా సొంతం చేసుకునేందుకు కొందరు టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఉన్నతాధికారులు పంచాయతీ వేలంపై దృష్టి పెట్టాల్సి ఉంది.

వేలం పారదర్శకంగా నిర్వహించాలి

స్థానిక పంచాయతీ దుకాణ సముదాయాలు, మార్కెట్, వారపు సంతలకు వేలంపాటను పారదర్శకంగా నిర్వహించాలని పట్టణవాసులు పంచాయతీ కార్యాలయంలో సోమవారం కార్యదర్శి మణికి వినతిపత్రం ఇచ్చారు. వేలంపాటలకు 15 రోజులకు ముందుగా నోటిఫికేషన్ ఇచ్చి, గ్రామంలో దండోరా వేయించాలన్నారు. పంచాయతీ ఉన్నతాధికారుల సమక్షంలో పారదర్శకంగా బహిరంగ వేలం వేసి పంచాయతీకి ఆదాయం పెంచాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతి నారాయణ, మాజీ ఉప సర్పంచ్ మునీర్, వార్డు సభ్యులు రాజేష్ రెడ్డి పాల్గొన్నారు.

సంతవేలూరు చెరువు అభివృద్ధికి తోడ్పాటు


సంతవేలూరు చెరువును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరు చెరువు అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని స్థానిక ఆయకట్టు రైతులు తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను వేడుకున్నారు. సోమవారం సాయంత్రం సంతవేలూరు చెరువును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వర్షాలకు చెరువుకు చేరిన వరద నీరు, ఉధృతంగా ప్రవహిస్తున్న చెరువు కలుజును ఇరిగేషన్‌శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. స్థానిక రైతులు వెయ్యి ఎకరాలకు పైగా ఆయకట్టు కలిగిన సంతవేలూరు చెరువు ఆధారంగా వ్యవసాయం చేపట్టాల్సి ఉంది. అయితే చెరువు కట్ట పలుచోట్ల కోతకు గురై గండిపడే ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని, ఈ విషయమై పలుమార్లు ఇరిగేషన్‌శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేదని రైతులు వాపోయారు. కలెక్టర్ స్పందిస్తూ చెరువు కట్ట అభివృద్ధి కోసం రూ.9లక్షలు మంజూరు చేయనున్నట్టు రైతులకు హామీ ఇచ్చారు. ఆక్రమణకు గురైన భూములను తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తహసీల్దార్ రాజశేఖర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట సూళ్లూరుపేట ఆర్డీఓ కిరణ్మయి, ఇరిగేషన్ ఈఈ మదనగోపాల్, డీఈ రత్నాకర్ రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ ప్రసాద్, స్థానిక నాయకులు బాబు రెడ్డి, సుధాకర్ ఉన్నారు.

అవినీతి ఎంపీడీఓపై విచారణ జరపాలి

శ్రీకాళహస్తి రూరల్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న శ్రీకాళహస్తి ఎంపీడీఓ రఫీక్ ఖాన్‌పై విచారణ జరపాలని భారత కమ్యూనిస్టు పార్టీ శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంపీడీవో రఫీక్ ఖాన్ గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ సిబ్బందికి వేతనాలు విడుదల చేయించానని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.5వేలు చొప్పున రూ.79వేలు తన ఖాతాకు ఫోన్ పే ద్వారా వేయించుకున్నారని ఆరోపించారు. గతంలో ఉపాధి హామీ గ్రామ సభలకు షామియానాలు వేయకుండానే రూ.60 వేలకు పైగా స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఎంపీడీవోకు మామూళ్లు ఇవ్వలేదని కొంతమంది ఉపాధి సిబ్బందిని విధుల నుంచి శాశ్వతంగా తొలగించారని తెలిపారు. ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపితే ఎంపీడీవో రఫీక్ ఖాన్ అవినీతి వెలుగు చూస్తుందని అభిప్రాయపడ్డారు. విచారణ జరపకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

4న చెరివిలో విద్యుత్ లోక్ అదాలత్

సత్యవేడు: శ్రీసిటీలోని చెరివి ట్రాన్స్‌కో ఏఈ కార్యాలయ ప్రాంగణంలో ఈనెల 4న ప్రత్యేక విద్యుత్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నాగలాపురం ఏడీఏ రమేష్ విలేకరులకు తెలిపారు. బుధవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఈ కార్యక్రమాన్ని విద్యుత్ లోక్ అదాలత్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి అధ్యక్షతన నిర్వహించనున్నామని, పుత్తూరు ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని వడమాలపేట, రాయల చెరువు, పుత్తూరు, పుత్తూరు రూరల్, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు, వరదయ్యపాళెం, చెరివి ట్రాన్స్‌కో సెక్షన్ల సంబంధించిన విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాతపూర్వకంగా అర్జీలు ఇస్తే పరిష్కరిస్తామన్నారు. అదాలత్‌లో ఆర్థిక సభ్యులు రామ్మోహన్ రావు, సాంకేతిక నిపుణులు ఎస్ఎల్ అంజన్ కుమార్ పాల్గొంటారని, దీనిని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో గజేంద్రనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంలో భాగంగా 7వ తరగతి లోపు విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పొడవు, బరువు, శరీరంలో రక్తశాతం, పెరుగుదలలో ఏవైనా లోపాలు ఉన్నాయా అనే విషయంపై పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యులు స్రవంతి, బాలహుసేని, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం కాదు..నాణ్యమైన విద్యేది బాబూ?

- పుణ్యక్షేత్రంలో మద్యపుటేర్లు పారిస్తున్న సీఎం
- ఇది శ్రీవారికి చెల్లిస్తున్న తీర్థప్రసాదమా?
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి మండిపాటు


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి

సత్యవేడు: ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరి రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూళ్లు చేసి ఆదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పని తీరు ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి విమర్శించారు. సత్యవేడులో సోమవారం సీపీఎం జిల్లా 14వ మహాసభల ముగింపు సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. రాష్ట్రంలో నాణ్యమైన మద్యం ఇస్తామంటున్న చంద్రబాబు నాణ్యమైన విద్యను ఎందుకు ఇవ్వలేకపోతున్నారని ప్రశ్నించారు. వాటికన్ సిటీగా తీర్చిదిద్దుతామన్న పుణ్యక్షేత్రమైన తిరుపతిలో పాలకులు మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా చూస్తే తిరుపతి జిల్లాలోనే అత్యధిక శాతం మద్యం దుకాణాలు ఉన్నాయని, ఇది పాలకులు శ్రీ వేంకటేశ్వరస్వామికి చెల్లిస్తున్న తీర్థ ప్రసాదమా..? అని సూటిగా ప్రశ్నించారు. ఇప్పటికే జాతీయ రాహదారుల్లో టోల్‌ఫీజుల ద్వారా రూ.22 వేల కోట్లు దోచి పెట్టిన బాబు ప్రభుత్వం జిల్లా రహదారుల ద్వారా కూడా కూడా టోల్ తీసేందుకు సన్నాహాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రజలకు పవన్ ముఖాన్ని చూపించి, మతోన్మాదాన్ని ప్రేరేపించి బీజేపీ ఓటు రాజకీయానికి తెర లేపుతోందని రమాదేవి ఆరోపించారు. రాష్ట్రానికి ముప్పుగా పరిణమిస్తున్న మోదీ–పవన్ దోస్తీని ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. సీపీఎం ప్రజల పక్షాన భవిషత్ పోరాటాలకు సిద్ధమౌతోందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య, సీపీఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, దాసరి జనార్ధన్, టి. సుబ్రమణ్యం, జిల్లా కమిటీ సభ్యురాలు సాయిలక్ష్మి, జోగిరమేష్, సత్యవేడు కార్యదర్శి ఎం.రమేష్, అరుణాచలం తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం బసవయ్యపాళెంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేము మధు కుమారుడు వేము వాసుదేవ్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మదుసూదన్‌రెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని వాసుదేవ్ మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే వారికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంజూరు లక్ష్మణ గిరిబాబు, వల్లం గోపి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక అవగాహన అవసరం



బహుమతులు అందజేస్తున్న ఎంఈవో బాలయ్య

శ్రీకాళహస్తి: ప్రతి విద్యార్థి సామాజిక అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో బాలయ్య అన్నారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో గల శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం సోషల్ వీక్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు వ్యక్తిగత, సామూహిక పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ రూపాదేవి, ఏజీఎం సురేష్, డీన్ సుబ్రహ్మణ్యం, ఇన్‌చార్జిలు కల్పన, త్రివేణి, థామస్, ఉపాధ్యాయులు పుష్ప, శ్వేత, ఏవో సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు తగ్గాక కాజ్‌వే పనులు


మాట్లాడుతున్న తహసీల్దార్ హనుమాన్ నాయక్

నాగలాపురం: మండలంలోని ద్వారకానగర్ కాజ్‌వే, కొట్టకాడు కాజ్‌వేలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసిందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సింధు అధ్యక్షతన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే మాట్లాడారు. తుపాను మూలాన కురుస్తున్న వర్షాలు తగ్గిన తర్వాత కాజ్‌వే పనులను ప్రారంభిస్తామన్నారు. వివిధ శాఖల అధికారులు మూడు నెలల ప్రగతి నివేదిక నివేదించారు. అనంతరం తహసీల్దార్ హనుమాన్ నాయక్ మాట్లాడుతూ, కొత్త రేషన్ కార్డులు నమోదు ప్రక్రియ త్వరలోనే ప్రారంభమవుతుందని, ప్రస్తుతానికి ఆధార్ కార్డులో పేర్లు, బయోమెట్రిక్, చేసుకోదలచిన వారికోసం మండలంలోని కొన్ని సచివాలయాలలో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా పింఛన్లకు సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ట్రాన్స్‌కో ఏడీ, వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. వారి దృష్టికి ప్రజాప్రతినిధులు సమస్యలు నివేదించారు. మేజర్ పంచాయతి సర్పంచ్ చిన్నదొరై సుధా, వైస్ ఎంపీపీ కుమారి, ఎంపీడీఓ బాలాజి నాయక్, పుత్తూరు ట్రాన్స్‌కో ఈఈ దేవాశీర్వాదం, ఏడీ రమేష్, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు